# కాలు కదపని అదృష్టం

శ్రీమతి ఐ. వి. యస్. అచ్యుతవల్లి

"అమ్మగారండీ! అమ్మగారూ!" అంటూ గొల్లవాడు గేదెని తెచ్చి, వాకిట్లో నిలబెట్టి అర్ధగంటనించీ గొంతు చించుకొని అరుస్తున్నాడు. రాజామణికి ఆ పాలవాడి కేకలు, కలలోనికి మళ్ళీ వినిపించుతున్నాయి. బద్ధకంగా అటునించి ఇటు వత్తిగిల్లి విసుక్కుంటూ, 'అబ్బ! వూఁ...' అంటూ దీర్ఘంగా మూలిగింది. 'ఏయ్! ఏమిటా బద్ధకం? లే! లేచి, పాలు పితికించుకో! ఆరుగంటలు దాటుతున్నా, కాళ్ళు తన్నిపెట్టి, ముసుగుతన్ని పడుక్కునే ఆడదాన్ని, నిన్నొక్కర్తినే చూసాను' అని పక్క మంచంమీద పడుక్కున్న రవణ విసుక్కున్నాడు. తన మటుకు తను కాళ్ళదగ్గర చెదిరిన దుప్పటిని గుండెలదాకా లాక్కుని, ఇంటి పై కప్పుకేసి చూస్తూనే వున్నాడు. 'అబ్బబ్బ! వెధవగోల! అప్పుడే తగలడ్డాడా!' అని గొణుక్కుంటూ లేచి, దభీదభీమని తలుపులు చప్పుడుచేస్తూ వంటింటిలోనికివెళ్ళి స్టీలు గ్లాసూ, స్టీలు గిన్నె తీసుకుని, వీధి వసారాలోనికి వచ్చింది రాజామణి. అప్పటికే గొల్లవాడు చెంబు నిండుకూ పాలు నురగవచ్చేలా పితికేశాడు వీధిగేటుకి ఒకప్రక్కగా గేదెని నిలబెట్టాడు వాడు గేదె 'చిట్టు జంగిడీ' లోని చిట్టు పూర్తి చేసేసి, ఖాళీ జంగిడిని బరుకు బరుకూ నాకుతోంది. రాజామణి పాలు పితికేసి రెడీగా నించున్న గొల్లవాడిని చూసి నుదురు చిట్లించింది.

'అప్పుడే పితికేసావా? నీ కెన్నిసార్లు చెప్పాను నేను లేచి ఖాళీచెంబు చూస్తేకాని పితకొద్దనీ? మీ పాడుబుద్ధులు మీరు పోనిచ్చుకోరు. మేము ఎంత డబ్బు పోసినా సరే!' అంటూ కేకలేసింది.

'ఏ ఝామునించీ అరుస్తున్నానమ్మా! ఎంతకీ లెగరాయె! గేదె చిట్టుదాగరాలో కలియబడ్డది. ఆ కూసంతా కాజేసిందంటే 'సిరాలు' తాకనిస్తదా తల్లీ! కంగరుపడి పితికేసాను' అన్నాడు నమ్రతగా గొల్లవాడు. పైపై నురగవుంది. జానెడు స్టీలుగ్లాసుతో నాలుగు గ్లాసులూ కొలిచిపోసాడు రాజమణి గిన్నెలో. పైన అర్థగ్లాసుడు పాలు మిగిలాయ్. 'అంతా నురగతో కొలిచేసావు. ఆ కాసిని ఒంపెయ్యి!' అంది మణి.

'అయ్యోతల్లీ! ఆ కాసిని వున్నయ్యా! పావులా పాలు అయ్యి' అంటూ చెంబు పుచ్చుకుని వెళ్ళిపోబోయాడు.

'పావులా పాలా! దాంట్లో సగానికిసగం నీళ్ళే కలిపేసావు ఇక్కణ్ణించీ నేనులేచి చెంబుచూస్తేకాని పాలుపిండితే నేను పుచ్చుకోను ఒకసారి కేకవేసినట్టే వేసి లుడుకూ లుడుకూ పిండేస్తావు!' కోపంగా గట్టిగాఅంది, రాజామణి.

'అంత కోపం దేనికి తల్లీ! ఈ పాలు కాసినీ మీరే తీసుకోండి! ఇయ్యాల ఒంట్లో పుటపరం తగిలినట్టుండాది. కాఫీనీళ్ళు కాయించుకుందారని వుణ్నిచ్చాను ఆ పాలు! కూన్న కాఫీనీళ్ళు పోయించేండి!' అంటూ, ఆ పాలు రాజామణి గిన్నెలోనికి వంపేసి, 'ఇస్సో! రామా!' అంటూ వసారాస్తంభానికి జేరబడి కూలబడ్డాడు గొల్లవాడు. పాలగిన్నె పుచ్చుకుని లోనికి వెళ్ళబోతూ యాధాలాపంగా పక్కింటి వసారాకేసి చూసింది రాజామణి. ఆమె చూపులు అట్టే నిలబడ్డాయ్! ప్రక్కింటి వసారాలో లేత ఉదయపు చల్లని వెలుగుతో కూడిన నీరెండ పడుతూంది. ఆ ఎండ కాళ్ళమీదకు వచ్చేటట్లు ఒక పేము కుర్చీలో కూర్చుంది జయమ్మ! పక్కన ఒక కుర్చీలో ఆమె భర్త కూర్చున్నాడు. ముందున్న చిన్న టీపాయ్ మీద ట్రేలో పింగాణీ కెటిలూ, కప్పులూ, సాసర్లూ వున్నాయి. ఆయన కెటిలులోని డికాక్షన్ కప్పుల్లో

నికి వంపి, పాలూ, పంచదారా కలిపి, ఒక కప్పూ, సాసరూ, జయమ్మకిచ్చి, ఇంకోటి తానుతీసుకున్నాడు. మణివాళ్ళింటికీ, జయమ్మ యింటికీ మధ్యన, నాలుగడుగుల ఎత్తున సిమెంటు ప్రహరీగోడ వుంది. ఇళ్ళు బాగా ఎత్తున కట్టబడివుండటంనించి, ఒకళ్ళ వసారాలో నిలబడితే ఇంకొకళ్ళకి బాగా కనబడుతుంది. అందులో ప్రహరీగోడకి వసారాలకి, అయిదారు అడుగుల దూరంకన్నా ఎక్కువలేదు. దానా దీనా. ఒకింటిలోవాళ్ళు ఒకింటికి స్పష్టంగా కనబడుతారు. తూర్పుదిక్కుగా తలవాకిళ్ళున్న ఇళ్ళు అవి. అంచేత సూర్యోదయాలు ఎంతో ఆహ్లాదకరంగా వుంటాయి రాజామణివాళ్ళు ఆ వూరు బదిలీ అయి వచ్చి పది రోజులయ్యింది. ఈ పది రోజులుగా, మణి ప్రక్కవాళ్ళని అట్టే గమనించలేదు. ఇల్లంతా సామాన్లు సర్దుకోవడం, హడావిడి సరిపోయింది. ఇవ్వాళ తీరిగ్గా నించుని, జయమ్మ వసారాకేసి చూస్తూ నిలబడిపోయింది. జయమ్మ హాయిగా, ప్రత్యూష పవనాలను అనుభవిస్తూ, భర్త చెప్పే కబుర్లకి, సున్నితంగా నవ్వుతూ, ఉదయపు కాఫీ తీసుకుంది. జయమ్మ పెద్దకూతురు, పది పదహారేళ్ళుంటాయి. వోణీలేసుకుంటోంది. హంసలా నడిచి వచ్చి ఖాళీ ట్రే తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి పేరు సుజాత. ఆమెకి సుజాతకాక ఇంకా ఇద్దరు మగపిల్లలూ, ఇద్దరు ఆడపిల్లలూ వున్నారు. పన్నెండేళ్ళూ, ఆరేళ్ళూ మధ్య పిల్లలు వాళ్ళు. తెల్లవారేసరికి చక్కగా స్నానాలుచేసి, శుభ్రమయినబట్టలు కట్టుకుని, వసారా చివరన జంపకానా పరుచుకొని చదువుకొంటూ వుంటారు. జయమ్మ భర్తకి తొమ్మిది గంటలయ్యేసరికల్లా జీప్ వస్తుంది. అందులో ఆయన వెళ్ళిపోతాడు. జయమ్మ చాలా నాజూకుగా, తెల్లగా, వెన్నెలదారంలా వుంటుంది. అయిదుగురు పిల్లల తల్లిలా వుండదు! చాలా ఖరీదైన చీరలు, పాము కుబుసంలా పాలమీగడలా ముట్టుకుంటే జారిపోయే చీరలు, గుప్పిటలోనికిఇమిడిపోయే చీరలు ధరించుతుంది. ఆ చీరలవల్ల ఆ పొందికయ్యైన శరీరానికే లావణ్యం వచ్చేదో! ఆమె శరీరపు వన్నెచేత, చీరలే సొగసుగా కన్పించేవో! ఏది ఏమయినా, పరస్పరాశ్రయంచేత చీరల సొగసూ, జయమ్మ శరీరపు లావణ్య దీప్తి పోటీలుపడుతూ చూపరుల కళ్ళను తమవైపు బలీయంగా ఆకర్షించుకునేవి!

'ఏమే! కాఫీ అయ్యిందా! లేవనా ?' అని రవణ కేక వేయటంతో రాజామణి బలవంతంగా కళ్ళు తిప్పుకుని విసవిసా లోపలికి వెళ్ళింది.

'లేవనా ?' మళ్ళీ అడిగాడు రవణ.

'ఒఖ్క అయిదు నిమిషా లుండండి' అంటూ కుంపటి రాజేసి, గిన్నెలో కాఫీ డికాక్షన్‌కి నీళ్ళు పెట్టింది. తర్వాత రెండు టూత్‌బ్రష్‌ల మీద వేపగింజంత టూత్‌పేష్టు వేసి, స్టీలు మరచెంబుతో నీళ్ళూ, స్టీలు టంగ్ క్లీనరూ... ముందు గదిలో టేబిలుమీద పెట్టి, తను ఇత్తడి చెంబుతో నీళ్ళు ముంచుకొని పెరట్లోకి ముఖం కడుక్కుందుకు వెళ్ళింది. రవణ వీధివసారాలో కూర్చుని ముఖం కడుక్కొని, చెంబు వంటింట్లోకి తెచ్చిస్తూ,

'తువ్వాలే ?' అన్నాడు.

'ఆ తలుపుమీద వుంది. తీసుకోరాదూ ?' అంది రాజామణి. తువ్వాలు తీసుకుని వంటింటి గడప మీద కూర్చుని ముఖం తుడుచుకుంటూ,

'ఇంకా నువ్వు ముఖం కడుక్కోలేదూ ? అవునులే! అపరాహ్ణ పర్యంతం ధంతధావన పుణ్యకాలః అన్నారు మన పెద్దలు! మరేం ఫరవాలేదు! ఇరవయినాలుగ్గంటల కాలంలో, రెండుపార్లు కాఫీలు, రెండుపార్లు భోజనాలు చేయలేకపోతామా?' సాధింపుగా అన్నాడు.

రాజామణి మూతి మూరెడు చేసుకుని, చెంగుతో ముఖం తుడుచుకుంటూ వచ్చి,

'అత్తగారు లేని లోటు లేకుండా, బాధించమంటే, బాధించుతారు! కుంపటిమీద నీళ్ళు తెర్లుతున్నాయి కదా! రెండు చంచాలు కాఫీగుండ వేసేసి, దింపేస్తే, మీ పెద్దలేమయినా చెరబోతారా ? మీ కలక్టరుద్యోగం హోదా దిగిపోతుందా ? కాస్త చేయిసాయితాగా వుండరు. అన్నీ వేళకి అమరిపోవాలంటారు!' అంటూ కాఫీడికాక్షన్ తీయటం, కాఫీ కలపటంలో నిమగ్నురాలయింది.

'శభాష్! ఇవ్వాళ కాఫీ చేయకూడదా అంటావు! రేపు బియ్యం కడిగి పడేయకూడదా అంటావు! ఇంక వంటా, కాఫీ టిఫెన్లూ అన్నీ నేనే చేసేసుకుంటే, ఇంక నువ్వెందుకూ? తిని కూర్చుందుకా? నా కొచ్చే ముష్టి మూడువందల రూపాయిలూ ఎక్కడ కరగటం లేదో అని భయపడి, నిన్ను కట్టిపడేశారు నా ప్రాణానికి' అన్నాడు చిలిపిగా రవణ. రవణకి రాజామణి మేనమామ కూతురు. మణి పుట్టీ పుట్టగానే, 'మా రవణిగాడికి పెళ్లాం పుట్టింది' అం ది ర వ ణ తల్లి. మణి, రవణ పెళ్లాంగానే పుట్టింది. పెళ్లాంగానే పెరిగింది. మణి ఫోర్తుఫారం పరీక్షలు వ్రాయగానే రవణతో పెళ్లి అయిపోయింది. ఇంక ఆపయిన చదువు జరగలేదు. నోములనీ, వ్రతాలనీ, పండగలనీ, పబ్బాలనీ, అత్తింటినించి పుట్టింటికీ, పుట్టింటినించి అత్తింటికీ తిరగటంతోనే సరిపోయింది. ఈలోగా రవణ ఉద్యోగాన్వేషణ ఫలించి, ఉద్యోగం దొరికింది. కొత్త సంసారం. ఆ వూరినించి ఈ వూరికీ, ఈ వూ రి నిం చి ఆ వూరికీ ట్రాన్స్‌ఫర్స్ అవుతూండటం. సంసారం ఝంఝాటంలో వచ్చే బంధువులూ, వెళ్లే బంధువులూ, చుట్టరికాలూ, స్నేహాలూ, ఇంట్లో వున్నవీ లేనివీ చూసుకుంటూ, అతిథిసత్కారాలు జరుపుతూంటం— వీట్లతో సరిపోయేది. కొత్తలో ఎప్పటికయినా— మెట్రిక్‌కు కట్టి పై చదువు చదువుకోవచ్చును— అన్న ఉత్సాహం వుండేది. రానురానూ ఆవిడలో ఆ జీవకాంతి సన్నగిల్లింది. చైతన్యం గడ్డకట్టింది. ఒక్కొక్కపూట పనిమనిషి వచ్చేదికాదు. అంట్లగిన్నెల దగ్గర్నించీ తోముకోవలసివచ్చేది. కొత్తరోజుల్లో 'మనిల్లు మనవాకిలీ నేనే. ఇవన్నీ దిద్దుకు రావాలి!' అన్న స్వయంఅధికారం ఆమోదాన్నే కలిగించేది. ఇద్దరు పిల్లలు కలగటంతో నీరసించిపోయి 'ఈవెధవ సంసారం రొంపిలోంచి, నిష్పూచీగా ఎల్లా బయటపడగలను దేముడా!' అని నిరతమూ మధనపడేది. ఆవిడ పిల్లలు, వెంకటీ, సూరీడూ, కూడా ఆడపిల్లలే! వెంకటికి తొమ్మిదేళ్లుంటాయి. నాలుగో క్లాసు చదూతోంది. సూరీడుకి ఏడు సంవత్సరాలుంటాయి. రెండోక్లాసు పుస్తకం తప్పులు తప్పులుగా చదూతుంది.

'అయితే విూపన్లుచేసి పెట్టాలనే అన్నమాట! పెళ్లాడుతా! చాకిరీ కోసరమా పెళ్లాం? నాలుగు రూపాయలుపారేస్తే, దాసీది చేసిపెడుతుంది కదా పన్లు అన్నీను?' అంటూ కాఫీగ్లాసు తెచ్చి రవణ కిచ్చింది.

'కార్యేషు దాసీ అన్నారు కదుటోయ్ మరీ?' అంటూ కాఫీగ్లాసు అందుకుని రెండు గుక్కలుకాఫీ పీల్చాడు. ఈలోగా పిల్లలు లేచివచ్చారు.

'అమ్మాపేష్టే!' అంటూ నించున్నారు.

'లేచారా చిట్టితల్లుల్లారా! అలమారలో క్రింది అరలోవున్నాయి. విూ బ్రష్షులు. పేష్టు అక్కడేవున్నయ్. కాస్త తీసుకోలేరూ?' అంది మణి.

'మేము తీసుకుంటే ఆ బజారాని నొక్కేస్తా మన్నావు కాదుటే మరీ!' అంటూ బిక్కమొఖాలేసారు.

'నాన్నారూ! పేస్టు అంతా ఇవతలికి తెచ్చేస్తే మళ్లీ ఎల్లా పెత్తాలంక్షి!' అంది, జిజ్ఞాసగా సూరీడు.

'వసే! నువ్వెళ్లి పేస్టు ఈయకపోతివా, వీళ్ల ఎక్స్‌పెరిమెంటు చేసేస్తారు. అనక ఎన్నితిట్టినా లాభం వుండదు' అన్నాడు రవణ.

'అబ్బబ్బ! ఛస్తున్నా వెధవ సంతతోటి! పదండి!' అంటూ, ఇద్దరికీ, చెరొక చెంబుతో నీళ్లూ, పేస్టూ ఇచ్చి నందివర్ధనంమొక్కదగ్గర ఒకళ్లనీ, మందారం చెట్టుదగ్గర ఒకళ్లనీ, ముఖాలు కడుక్కోమని ఆజ్ఞాపించి, కాఫీగ్లాసు దగ్గర కూలబడింది. ఒకగుక్క కాఫీ ఆత్రంగా తాగి

'ప్చ్! చప్పగా చల్లారిపోయింది' అని విసుక్కుంది. అప్పటికి రవణ, కాఫీ త్రాగటం పూర్తి చేసేడు.

'చిన్న వక్కముక్క పడెయ్యి!' అన్నాడు.

'లేచింది మొదలుగా అన్నీ అందించాలి! తిరగలేక నా కాళ్లు నొప్పులు పడుతున్నాయి! మీకు తెలీకపోతే చూచయినా నేర్చుకోరు ఆ ప్రక్కింటి జయమ్మగారిని చూడండి! కుర్చీ దిగదు ఆవిడ!

పెట్టిపుట్టాలి అంటారు, ఇందుకే మరి!' అని పొగ దీసుకుంటూ, లేచి అలమారు తీసి ఒక చిన్న వక్క ఇచ్చింది.

'మరీ కాస్త ఇచ్చేవేమిటే! అస్తమానూ అడిగితే విసుక్కుంటావు. ఇచ్చేప్పుడే మరి కాసిని ఈయకూడదూ! చెయ్యి మహాగట్టి! జయమ్మగారిని చూడకేం! నిక్షేపంలా చూసేను చాలా బాగుంటారు. అల్లా కూర్చుంటే నువ్వు నాకు చేస్తావా? కుంపటి దగ్గరకొచ్చి, కాఫీ పొయ్యవే అంటేవే, కాళికాదేవి, అవతారం ఎత్తుతావు! అల్లా దర్జాగా, ఈజీఛైర్‌లో కూర్చుని 'కాఫీ' అంటే, సుకుమారంగా, సుందరంగా అందాలు చిందుతూ వయ్యారాలు వలకబోస్తూ, ట్రేతో కాఫీకప్పులు తెచ్చిపెట్టి స్వీట్‌గా నవ్వే, ఘటాలా మనవి?' అన్నాడు రవణ.

'బాగుంది సరసం! ఇంకా ఆపిడలా మీరు కూర్చోవాలనుకుంటున్నారా! బుజ్జితండ్రికి ఎంత కోరిక? నన్ను కూర్చోపెట్టలేదనే బాధ చీమంతయినా లేదు. ఇక్కడికీ అందింపులు చాలలేదు సోగ్గాడికి!' అంటూ కుంపటిమీద తెర్లుతూన్న పాలతో మళ్లీ నాలుగ్లాసుల వేడికాఫీ తయారుచేసింది మణి. కాఫీ గ్లాసు పెదాలమీదకు ఎత్తబోతుండగా,

'అమ్మగోరూ అంటగిన్నెలో డెయ్యండి పొద్దెక్కిపోనాది!' అంటూ పనిమనిషి పిలచింది. మణి గ్లాసు క్రిందపెట్టి లేచిబోతూండగా,

'వస్తోందిలే! ఈలోగా నువ్వా ముందుగది వూడ్చెయ్యి! నువ్వా కాఫీ తాగి మరి లేవోయ్! మళ్లీ చల్లారిపోయిందని గొణుక్కుంటావు!' అన్నాడు రవణ.

'ఇంతలో దాన్ని గదెందుకు వూడ్చుమన్నారూ? అది అన్నీ ఈలోగా చక్కబెట్టేస్తుంది. డ్రాయరులో, పూలకని మార్చిన చిల్లర రూపాయివుంది. నా వాచీ వుంది. కాస్త అవి వెళ్లి ఆ ముందుగుమ్మంలో నించోండి!' అంది.

'దానికి, నేను నించుంటే సిగ్గవేస్తుందేమోనే!' అన్నాడు వక్కముక్క పటుకు పటుకూ నములుకుంటూను, రవణ.

'సిగ్గూ సింగారం ఏమీలేదు. లేనిపోనివి మప్పిపెట్టకండి! వెళ్లండి! అది గదిలో దూరినట్లుంది!' అంది మణి.

'అబ్బబ్బ! నీ నెత్తిమీద తేలువుందంటే, నీ చేత్తోనే తీసెయ్యి అందట! నీలాంటి ఇల్లాలే! నాకే పురమాయిస్తావు పన్లు!' అంటూ లేచివెళ్లాడు రవణ.

'అమ్మా! కాఫీ' అంటూ వొచ్చేరు పిల్లలు.

'రండి!' అంటూ పిల్లలకి కూడా కాఫీ ఇచ్చి, అంట్లగిన్నెలు సర్ది పడెయ్యటంలో నిమగ్నమయింది.

## 2

సాయంకాలం. నాలుగ్గంటలవేళ. మల్లెపూల వాడు వచ్చేడు. వసారాలో కూర్చుని, తీరిగ్గా మల్లెమొగ్గలు ఎంచుతోంది రాజామణి. 'ఎల్లా తీసుకుంటున్నారు పిన్నిగారూ పూలు?' అంటూ సుజాత వొచ్చింది. మణివాళ్లు వచ్చిన వారంపదిరోజుల్నించీ ఆ పిల్ల చూస్తూనేవుంది. ఈరోజు మాటకలిపి స్నేహం చేయటానికి వొచ్చింది. 'డొక్కు ఇరవయి పైసలు' అంటూ గవ్వల్లాంటి మొగ్గల్ని ఎంచి, డొక్కులోకి పోసింది మణి. పూలుకొలిచే డొక్కు, చిన్న నెస్‌కేఫ్ డబ్బా అంత వుంటుంది.

'మాక్కూడా రెండు డొక్కులు ఎంచండి పిన్నిగారూ! డబ్బులు తీసుకొనివస్తా!' అంటూ లేడిలా, పరుగెత్తింది. సుజాత మణివాళ్లకి కూడా ఎంచింది పూల! డబ్బులు తీసుకుని అబ్బి వెళ్లిపోయేక పూలు చెండు గుచ్చుతూ అడిగింది మణి సుజాతని. 'ఏం చదూతూన్నావమ్మాయ్?'

'ఫిఫ్త్‌ఫారం ప్యాసయి మానేసానండీ!' అంది. సుజాత పొందిగ్గా కూర్చుంది ఆ పిల్ల తెల్లగా, సన్నగా, నాజూకుగా వుంది. చక్కటి పట్టుపరికిణీలు, పల్చటి జార్జెటు వోణీలు. వేసుకుంటూవుంటుంది ఆ అమ్మాయి.

'ఎందుకు మానేసావ్? బి. ఏ. దాకా చదూకోలేకపోయేవా?* అంది మణి. మణికి బి. ఏ. ప్యాసు కావాలని మహాకోరికగా వుండేది. అంచేత ఎవరయినా, చదూకున్నవాళ్లంటే గొప్ప సరదాగా వుంటుంది.

'మా అమ్మగారు బి. ఏ. ప్యాసు అయినారండీ! నాకు ఇంట్లోనే ప్రయివేటు పెట్టించి, చదువు చెప్పిస్తున్నారు. నేను ఇంట్లో లేకపోతే మా చెల్లెలూ, తమ్ముళ్ళూ అల్లరి చేసేస్తారు. తిన్నగా చదూకోరు! అయావి పెట్టినా, దానికి ఏదో లోకరా ఇచ్చేసి, అల్లరి చేస్తారు. అందుకని నేను ఇంట్లో వుండిపోవాల్సివచ్చింది.' అంది సుజాత.

'మీ అమ్మగారికి వంట పూర్తి అయ్యిందా?' అంది మణి.

'వంటపని అంతా మా బామ్మగారు చేస్తారు. మా అమ్మ చేయలేరు.' అంది సుజాత. ఆ పిల్లది చక్కటి తీయనైన గొంతు! వినయంగా మృదువుగా మాట్లాడుతుంది ఆ పిల్ల.

'సుజీ?' జయమ్మ తీయగా పిలిచింది.

'మా అమ్మగారు పిలుస్తున్నారండీ! నేను వెళ్తాను. మీరు మా ఇంటి కోసారి రాకూడదూ? మా అమ్మగారి కేమీ తోచదు. ఎవరన్నా వస్తే బాగుండును. కబుర్లు చెప్పుకుందికి. అంటూ వుంటారు' అంది సుజాత.

'అల్లాగేలే!' అంది మణి. సుజాత మల్లె మొగ్గల్ని చెంగులో పోసుకుని వెళ్ళిపోయింది.

'హుఁ! అదృష్టవంతురాలు! వంటకి అత్తగారు, కాఫీకి భర్తగారు, అలంకరణకి, పిల్లలు! పుట్టుభోగి! అంటూంటారు ఇల్లాంటివాళ్ళనే కాబోలు! సౌందర్యవతి! విద్యావతి! డబ్బుకూడా బాగానే వుంది కాబోలు! ఇంక ఇంటిల్లిపాదీ అడుగులకి మడుగులు వత్తటంలో ఆశ్చర్యం ఏముందీ? కాలు కదపకుండా, జరిపించుకుంటోంది. ఆ పిల్లచూడు, ఎంతజాణో! వాళ్ళమ్మగారికి, ఏమీ తోచదుట! అంచేత ఆ మహారాణీని ఎంటర్‌టయిన్‌మెంటు చేయటానికి, తను వెళ్ళాలిట. ఏం చమత్కారి? పూర్వం మహారాజులకి వేడుక చెలికాళ్ళూ, మహారాణులకి, వాళ్ళ తాపోపశమనం నిమిత్తం, గాయనీమణులూ నాట్యకత్తెలూ వుండే వాళ్ళట! అల్లాగ తను వాళ్ళమ్మగారికి చెలికత్తెలా వుంటే బాగుంటుందనుకొంది కాబోలు!' అనుకుంది, మణి. పూలన్నిగుచ్చేక, పెద్ద చెండు, తనుమడిచి జడలో పెట్టుకుని, పిల్లలిద్దరికీ, జానెడు జానెడు చెండు అట్టేపెట్టి, పిల్లల్ని కేకేసింది. వెంకటీ, సూరీడూ. ఎప్పుడు నేస్తుంకలిపారో అప్పుడే జయమ్మ గారింటికి జేరిపోయేరు. పిల్లలు ఎంతకీ, పలక్కపోంవాసరికి మణికి విసుగు పుట్టింది.

'ఛీ ఛీ! వెధవ పిల్లలు! ఎక్కడ చచ్చేరో!' అనుకుంటూ, నిటారుగా, నిలబడింది. పిల్లలు ఆటలాడుతూ కన్పించారు. సుజాత పెద్ద పెద్ద మొగ్గలన్నీ మాలగా కట్టి, తల్లికి ఇచ్చింది. చిన్న దండ తను జెడలో పెట్టుకుంది. సుజాత చిన్నపిల్లల్లో ఒక పిల్లకి బాబ్‌డ్ హెయిర్! జయమ్మ చక్కగా సిగ జుట్టుకొంది. మాల అందంగా సిగచుట్టూ అమర్చుకొంది. తెల్లని పాలనురుగడలాంటి జరీచీర, తెల్లని ఫుల్‌వాయిల్ బ్లవుజూ ధరించింది. పిల్లలు ఆడుకుంటూంటే, సంతోషంతో వెలిగిపోతూ చూస్తూ కూర్చుంది, ఠీవిగా జయమ్మ!

'జడలేస్తాను రండర్రా!' అని పిలచింది మణి. వెంకటీ సూరీడూ తల్లి పిలవగానే పరుగెట్టుకుని వొచ్చారు. దువ్వెన తీసుకుని పిల్లలకి తలదువ్వటం ప్రారంభించింది మణి. ఇద్దరికీ కూడా వొత్తుగా, బారెడు, పొడుగు జుట్టువుంది. సూరీడు కట్టు, వంకులు తిరిగి వుంటుంది. సూరీడుకు గట్టిగా బిగించి, రెండు ఆల్లులు అల్లి, పూలుముక్క బిగించేస్తే మిగతాజుట్టుఅంతా, వంకులు తిరిగి, గుత్తిగా, అందంగా వుంటుంది. దానికి ఎప్పుడూ అల్లానే వేస్తుంది, మణి, జడ. వెంకటి జుట్టు సాఫీగా వుంటుంది. దానికి చివరదాకా అల్లేసి, పూలు ముక్క బిగించేస్తుంది. రిబ్బన్లు ఎన్నికొన్నా పారేసుకొంటూరు వాళ్ళు. లేకపోతే మురికెత్తిపోయి, వుతికితే వెలిసిపోయి అసహ్యంగా వుంటాయి. అంచేత రిబ్బన్లు కొన్నా ఏ పండగలప్పుడో పెడుతూ వుంటుంది మణి.

'అమ్మా మ్మా! నాకు రెండు జళ్ళెయ్యవ్' అంది వెంకటి.

'ఛ! ఏం బాగుండవు! నీ జుట్టు పొడుగు. సన్నగా తోకల్లా వుంటాయి' అంది మణి.

'పొడుగు అయితే కత్తిరించేయకూడదూ? వాళ్ల 'సుభా'కి చూడు. ఇంచక్కా, రెండు జళ్లేస్తారు. చక్కటి చేతుల్లేని, గౌన్లు తొడుగుతారు. నాకేమో వెధవ పావడాలు, జాకెట్లు! నేను తొడుక్కోను బాబూ!' అంటూ కాళ్లు బారజాపింది. ఆ పిల్ల కదలటంతో జడ వంకర వచ్చింది. మణికి కోపం వచ్చి, ఒక్క మొట్టు మొట్టింది. దానితో వెంకటి ఇంకా గింజుకుంటూ

'ఏమన్నా అంటే కొట్టావ్! నీకు పాపమేం తెలీదు. అందరు రెండు జళ్లేసుకుని, గౌన్లేసుకుంటూంటే నాకు సర్దా వుండదాయేం? అంతా నన్ను వెక్కిరిస్తున్నారు. పేరుకూడ బావులేదు' అంది.

'నీ పేరుకేం? చక్కనిపేరు, వెంకటలక్ష్మి అని! దానికేం వొచ్చింది? నిక్షేపంలా వుంటే?' అంది మణి.

'నువ్వేమో 'లక్ష్మి' అని అల్లా పిలుస్తావా? వెంకటీ వెంకటీ అంటావు. దాంతో వాళ్ల సుభా నవ్వి, అదేం పేరు? వెంకటీ సంకటీ అని అంటూ ఏడిపించుతూంది.' ఆపిల్ల కళ్లమ్మట నీళ్లూరాలాయ్.

'నా పేరూ బావులేదు! వాళ్లసుభా నన్ను ఎక్కిరించింది. 'సూరీ సూరీ చుంచెలుకా, మా ఇంటి కొస్తే, మంచెలుకా' అంటూ ఒకటేపాడింది' అంది నసుగుతూ సూరీడు.

'నీపేరు బాగానేవుంది. సూర్యలక్ష్మి అని. నాపేరే బొత్తిగా బావులేదు.' అంది వెంకటి. ఆపిల్లజడ పూర్తి అయ్యింది. తల్లి తీస్తున్న పూల దండచూసి

'నాకంత చిన్నదండా? అన్ని పూలూ నువ్వే పెట్టేసుకుంటావు. నువ్వెప్పుడూ ఇంతే! నా కొద్దు ఆ దండ! అదీ నువ్వేపెట్టేసుకో!' అంది వెంకటి.

'నాకూ చిన్నదండే వున్నిచ్చింది. అమ్మా మరేమో నాకు పూలు జడమీద కుట్టాన్నావు, మరెప్పుడు కుట్టావ్?' అంది సూరీడు.

'కుట్టాన్లే! జడగంటలు చేయిస్తున్నాగా! అని వచ్చాక, కుట్టాను. సుజా వాళ్లమ్మగారు చూడు. ఎన్ని పూలు పెట్టుకున్నారో? వాళ్లు అల్లా నసుగుతున్నారా? మీ రూరీకే గోలచేసేస్తారు.' అంది మణి.

'సుభా వాళ్లమ్మగారు మంచివారు! నీలా తిట్టారేమిటి? వాళ్లింట్లో బోలెడు పళ్లూ బిస్కట్లూ వుంటాయి. అవి సుభావాళ్లు ఇష్ట మొచ్చినన్ని తీసుకుంటారు. ఆవిడ ఏమీ అనరు. నువ్వు మమ్మల్ని చేగోణీలే తీయనీయవ్!' అంది నిష్ఠూరంగా వెంకటి.

'వాళ్లూ మాగ్గూడా పెడ్తారు. మొన్న ఎర్రటి పండేదో కోసిపెట్టారు వాళ్ల నాన్నారు. ఎంత బాగుందో! తియ్యగా వుంది.' అంటూ నాలిక చప్పరించుకుంది సూరీడు.

'వాళ్లు ఏ మన్నాతినే వేళకి, నోళ్లు తెరుచుకు, కూర్చోకూడదు. ఇవతలికి వచ్చేయాలి! ఏడుపు కొట్టుముఖాలు చూసి ఇంత పడేస్తారు. మరీ అస్తమానూ, ఆ కలిగిన వాళ్లిళ్లమ్మట డేకుతూంటే ఏం బాగుంటుందీ? సాయంకాలాలు, ఒక అరగంట ఆడుకుంటే ఫరవాలేదు. వెధవపాడు అలవాట్లు వచ్చాయి మీకు? పదండి ముఖాలు కడుక్కుని రండి! బొట్టూ కాటుకా పెడతాను' అంటూ లేచింది మణి.

## 3

అయిదారు రోజులు గడిచాయి. ఈలోగా రెండు మూడు తడవలు, సుజాత మణివద్దకి వచ్చింది. మణిదగ్గర క్రాస్‌స్టిచ్‌లో రెండు నెమళ్లు ఎదురు బొదురుగా నించున్న డిజైన్‌వున్న, డోరు కర్టెన్ వుంది. ఆ డిజైను, చిన్నదిచేసి, కుట్టు కోవటం, నేర్చుకుంటోంది, సుజాత. ఒకరోజు, సాయంకాలం, వసారాలోనికి వచ్చి నిలబడింది మణి.

'పిన్నిగారూ! ఇటు గోడవద్దకు రండి!' అంటూ సుజాత పిలిచింది.

'ఏవమ్మాయ్?' అంటూ సరిహద్దు వద్దకు వెళ్లింది.

'మా అమ్మగారు పిలుస్తున్నారు!' అంది సుజాత.

'ఏమండీ వంటకి వేళయిందేమిటి?' అని పలకరించింది, జయమ్మ.

'ఇప్పట్నించీ చేయనులెండి! చల్లారిపోతే వారు తినరు' అంది మణి.

'అయితే, ఒకసారి రండి! నాకేం తోచటం లేదు' అంది జయమ్మ. 'మణి'కి లోపల్లోపల వాళ్ల ఇల్లుఅదీ చూడాలని, మహాముచ్చటగా వుంది. ఆహ్వానం కోరుకోకుండానే లభించింది. కాదనట మెందుకు? తలుపులు జేరవేసి వాళ్లింటికి వెళ్లింది. ఎదురుగ్గా ఆమె భర్త కూర్చునే కుర్చీచూపించి,

'కూర్చోండి!' అంది జయమ్మ. మణి కూర్చుంది.

'ఈ మధ్యనే వచ్చారల్లే వుంది' అంటూ సంభాషణ కుపక్రమించింది, జయమ్మ.

'అవునండీ! మీ ఇల్లు స్వంతమే అను కుంటాను' అంది మణి.

'ఆఁ! ఈ ఇల్లు మాస్వంత ఇల్లే! ఆయన ఇంక అయిదారేళ్లల్లో రిటయిరయిపోతారు. అంచేత ఇక్కడ్నే స్థిరపడిపోయేము.' అంది జయమ్మ.

'మేమింకా బోలెడు వూళ్లు తిరగాలి! కాస్త వూరునలిగి, నలుగురూ, పరిచయం కాగానే ఇంకో వూరు ట్రాన్స్ఫరు అవుతూ వుంటుంది. నాలుగు వూళ్లా, చూస్తాం అనే సంతోషం వున్నా, ఈ సామాన్లు అన్నీ తర్లించుకుని, కొత్తవూళ్లో, ఇల్లూ వాకిలీ సర్దుకునే టప్పటికి, తల ప్రాణం తోకకివస్తుంది.' అంటూ మణి ఇల్లు నలువైపులా పరకాయించి చూసింది. వసారా చివరిమెట్టుకి, అయిదారు అడుగులు ఇటూ అటూగా, పోకచెట్లు వున్నాయి. వీధిగేటు కిరువైపులా, రకరకాల క్రోటను మొక్కలు ముద్దబంతిపూలచెట్లూ వున్నాయి. కాంపౌండు గోడచుట్టూ, డిశంబరు పూలమొక్కలూ చామంతిగోలేలూ వున్నాయి. వసారాలోకి చల్లటిగాలి వీస్తూ, పున్నమి రాత్రుళ్లు, వెన్నెల వెలుగు నింపుతూ ఆహ్లాదకరంగా వుంటుంది. ప్రమోద భరితమైన ఆ పచ్చనితోట చూస్తూండి పోయింది మణి. సుజాత ట్రేలో కాఫీ కప్పులు పట్టుకొని వచ్చింది.

'ఇప్పుడెందుకమ్మాయ్! ఇరుగూపొరుగూగా వున్నవాళ్లం, కాస్త ఖాళీ వుంటే కబుర్లు చెప్ప కుందుకు జేరుతూనే వుంటాం. మాకీ అతిథి మర్యాద లెందుకు?' అంది మణి.

'పుత్త కాఫీయేగా? తీసుకోండి, సరదాపడి కలుపు కొచ్చింది' అంది జయమ్మ.

'మరటయితే, అస్తమానూ ఫ్రీగా రావటానికి, బిడియంగా వుంటుంది' అంది మణి.

'దానిదేముందండీ? కొన్నపాలా ఏమన్నానా? మా ఇంట్లో, రెండు గేదెల పాడివుంది. కొన వేతులూ, పాలూ నాకు సయించవు. అంచేత, నేను ఏ వూర్లోవున్నా పాడి చేసేదాన్ని.' అంది జయమ్మ.

'జరుగుతోంటే ఏవీ పడవు! జరుగుబాటు లేకపోతే సర్దుకపోతారు మరి' అనుకుంది, తనలో తాను మణి. కాస్సేపు ఆ మాటా ఈమాటా మాట్లాడుకున్నాక

'సుజీ! మన ఇల్లు చూపించు మణిగారికి!

అంది జయమ్మ. సుజాతతో మణి, లోపలకి వెళ్లింది. జయమ్మ అల్లానే కుర్చీకి జారబడి కళ్లు మూసుకుంది. ఇల్లంతా చూసింది మ . పెద్ద పెద్ద గదులు. ఖరీదయిన ఫర్నిచరుతో అధునాతనంగా, అలంకరించబడి వున్నాయి, మేడమీద, పెద్దహాలు, వక చిన్నగదీ, చుట్టూడాబా వున్నయ్. పెరడులో, కొబ్బరిచెట్లూ, మామిడిచెట్లూ, కొత్తగా వేసిన అంట్లు కావటంనించి, పచ్చగా కలకల్లాడుతూ వున్నాయ్. గిలకల నూయిచుట్టూ నాలుగడుగుల వెడల్పున సిమెంటుచప్టా చేసివుంది. తులసికోట కావలగా, నందివర్ధనం, ముద్దమందార, గరుడ వర్ధనం, విరబూసివున్నాయ్. వంటింట్లో సుజాత బామ్మగారు, ఏవోకూరలు తరుగుతూ కూర్చున్నారు.

'అదృష్టవతి! కాలు కదపక్కర్లేకుండా, అందరూ ఆమెని మహారాణిలా చూస్తున్నారు. పూర్వ

కాలపువాళ్ళు, 'వండనిబువ్వా వడకనిబట్టా' కలిగి సుఖంగా వుండమ్మా' అని దీవించేవారు. ఆ కాలంలో, స్త్రీలు తీరిక సమయాల్లో ఎవళ్ళబట్టలకి సరిపడగా వాళ్ళు నూలుకూడా వడుక్కునేవారు కాబోలు! ఆకాలంలో వండుకోక్కర్లేకుండా బువ్వా వడుక్కోక్కర్లేకుండా బట్టా వచ్చేట్టయితే శ్రీమంతులక్రిందే లెక్క అయివుంటుంది. ఆ పూర్వకాలంనుంచే పుట్టి వుంటుంది ఈ దీవెన! ఈ ఇల్లాలికి అల్లానే జరుగుతోంది! కాలుకదపని అదృష్టం ఎంతమంది స్త్రీలకుందీ రోజుల్లో?' అనుకుంది మణి.

'ఈ పక్కింట్లో దిగారేమిటమ్మాయ్!' అంది బామ్మగారు.

'అవునండి!' అంది మణి. 'అక్కడున్న పీట వాల్చి కూర్చో అమ్మాయ్' అంది. మణి కూర్చుంది.

'ఎవరెవరుంటున్నారు' అన్నది బామ్మగారు.

'మా కుటుంబమే నండి. మేమిద్దరం, పిల్లలిద్దరూ. మీరు చూసేవుంటారు. ఆడుకుందుకు మీ ఇంటికి వస్తూనే వున్నారు.' అంది మణి.

'నీకు అత్తా మామా లేరా?' అంది బామ్మగారు.

'వున్నారు కానీండి, వాళ్ళూ మా పెద్దబావగారి దగ్గరే వుంటారు. వాళ్ళకి బోలెడంతమంది పిల్లలు. ఆవిడ, మా తోటికోడలు ఎప్పుడూ నీరసంగా వుంటూ వుంటారు. అంచేత అక్కణ్నే వుండిపోయారు.' అంది మణి.

'అవును మరి పెద్ద సంసారాల్లో వెనకాసరా లేకపోతే కష్టంకాదూ! నాకూ ఇంకా ఇద్దరు కొడుకు లున్నారు. ఆ కోడళ్ళు నీలాగే చాకుల్లా పనిపాటలు చేసుకుంటూంటారు. చిన్నపిల్లల్లే! తుళ్ళుతూ, గెంతుతూ వుంటారు. ఒకదానికి, ముగ్గురూ, ఒకదానికి నలుగురూ పిల్లలున్నారు. మా దగ్గర నాలుగు రోజులన్నా వుండవు, అని సాధించుతారు! కానీ, నాకేదీ ఇక్కడ్నే సరిపోతోందాయె! వెళ్ళటమే కుదరటంలేదు! నువ్వెళ్ళితే ఎల్లానే అమ్మా! అంటాడు మా పెద్దాడు!' అంది బామ్మగారు.

'తల్లి తండ్రులకి, సాధారణంగా పెద్దవాళ్ళంటేనే మోజు వుంటుంది లెండి! ఇంటికి పెద్దాళ్ళు, పెద్దాళ్ళు అంటూ ఏడువ్వా వాళ్ళకే పట్టం కడతారు. పెళ్ళిళ్ళుచేస్తే, ఇంటికి పెద్దవాళ్ళనే చూసి చేయాలి. ఇంట్లో చిన్నవాళ్ళకిచ్చి చేస్తే, చిప్పా కర్రా చేతబట్టుకుని మనిళ్ళకే తయారవుతారు మళ్ళీనూ! తల్లీతండ్రీ కూచమ్మల్లా కూడబెట్టినదంతా, ఈ జ్యేష్ఠులు త్రాష్ఠుల్లా తయారయి మాచమ్మల్లా మాయం చేస్తారు. ఏవన్నాఅంటే, తగాయిదాలకి తయారు. ఈ చిన్నకారు కోడళ్ళు! అంటారు' అంది మణి.

'నాకు అల్లాంటి భేదమేవీ లేదమ్మోవ్! నాకంతా సమానమే! నాకున్నదేదో ముగ్గురూ మూడు చెక్కలూచేసి తీసుకున్నారు. పిల్లాజెల్లాలో, వంటవాళ్ళమీద, దాయాలమీద, ఇంత సంసారం, పెట్టటం ఇష్టంలేక నేనే ఇక్కడ వున్నాను. మా పెద్దాడికా, వెలకీ ఇరవయిరోజులూ, క్యాంపులాయే! సుజాత చిన్నపిల్ల! ఒక్కర్తీ అన్నీ చూసుకోలేదు. అంచేత నేనే ఇల్లా కాలక్షేపం చేసేస్తున్నాను' అంది బామ్మగారు. సుజాత ఏదోపని జ్ఞాపకం వచ్చి, అవతలికి వెళ్ళింది. తనకితాను, స్త్రీ, ఎంత చదువుకున్నా, ఎంత సంస్కారంవుంది, అని వెన్ను చరుచుకున్నా, ఒకళ్ళని, పరిహసించి, వినోదించే, మనస్తత్వంవించి, ఎన్నటికీ తప్పుకోలేదు. ప్రతీ చిన్న విషయానికి, తనస్థితిని ఎదుటివాళ్ళస్థితితో పోల్చి చూసుకుని, తనకి జరగని సౌఖ్యాలు, వాళ్ళకి జరుగుతోంటే, శారీరకంగా, మానసికంగా కుళ్ళుకుని, పైకిమటుకి ఆ సౌఖ్యాలు ఎంతో అవమానకరమైనవిగా వేలెత్తి చూపి ఆనందించటం స్త్రీకి సహజగుణం! ఆ సహజగుణం మణిలోనూ వుంది. అంచేత సుజాత బయటికి వెళ్ళటంచూసి,

'అయినా బామ్మగారూ? నేను వచ్చినప్పట్నించీ చూస్తూనేవున్నా! పెద్దవారు మీరూ,

చిన్నపిల్లలు వాళ్ళా, అంతపనీ చేస్తూంటే దర్జాగా కూర్చుంటారేమిటండీ! మీకోడలు! ఎంత వుద్యోగస్థుని భార్య అయినా, బొత్తిగా అంత కాలుకదపని గర్వమా? కాస్త కూరావారా, తరిగి ఇచ్చినట్లూ, పిల్లలిని సవరించినట్లూ తిరగకూడదూ? అదే మా అత్తగారయితేనా, సాధించి సాధించి పోసేది. మీరు నిజంగా, దేవతామూర్తులు! కనుక వూరుకున్నారు! మా అత్తగారు వస్తారా? ఎంత చలికాలమైనా సరే, తలనిండా స్నానంచేసి వచ్చినట్లు, వండి పెట్టాల్సిందే! ఆమెగారు వూరుకున్నా వాళ్లబ్బాయి మటుకు, అమ్మచేత చేయిస్తున్నావా, అంటూ, వురి పెట్టినంతపని చేస్తారు.' అంది మణి, అక్కసుగా. బామ్మగారు కూరతరగటం ఆపింది. చెంగుతో వక్కసారి ముఖంతుడుచుకుంది. తలవంచుకుంది.

'పాపం! మా జయా బోలెడు పనిచేసేది! పిల్లల బట్టలు దగ్గర్నించి కుట్టుకునేది. ఒక్క క్షణం కూడా కూర్చునేదికాదు మావాడి షూట్లు కూడా అదే కుట్టేది. షూట్లుకుట్టటం, బెంగుళూరులో, రెండు నెలలువుండి నేర్చుకుని వచ్చింది. మిషనుమీద రకరకాల ఎంబ్రాయిడరీ పనులు చేసేది! ఏంచేయం? దేముడు చిన్నచూపు చూశాడు! ఏ లోటూలేకుండా, పరిపూర్ణంగా మనిషివుంటే, తన్ని మర్చిపోతారనీ, మొక్కులు మొక్కకోరనీ, భయం అనుకుంటా దేముడికి!'. ఆగి చెంగుతో మళ్లీ ముఖం తుడుచుకుంటూ,

'నాలుగేళ్లయింది. దానికాళ్లు పట్టేసి! నడవలేదు. ఏం రోగమో తెలీదు! వూరికే కుమిలి పోతూవుంటుంది. పిచ్చిది! మనిషికి కాళ్లూ కళ్లూ అన్నారు. ఇంక అవే ఉపయోగపడకపోతే బ్రతుకెందుకు? జీవచ్ఛవంలా!' సుజాత రావటంచూసి ఆపేసింది, బామ్మగారు. ఆమె కళ్లమ్మట నీళ్లూ రాలాయ్! మణి విస్తుబోయింది!'.

